
విద్యుత్తు ఉపకేంద్రం.. ప్రతిపాదనలకే పరిమితం!

● జిల్లా కేంద్రంలో పెరుగుతున్న కనెక్షన్లు ● సరఫరాలో హెచ్చు తగ్గులతో వినియోగదారులు సతమతం

న్యూస్‌టుడే, గుజరాతీపేట(శ్రీకాకుళం)

తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధి శ్రీకాకుళం నగరంలో 132 కేవీ ఉపకేంద్రం లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. తరచూ సరఫరాలో హెచ్చు తగ్గులతో సతమతవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ 132 కేవీ ఉపకేంద్రాలు ఉండగా ఇక్కడే లేదు. ప్రభుత్వం రెండెకరాల స్థలం కేటాయిస్తే రూ. 100 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మించడానికి ఈపీడీసీఎల్ సిద్ధంగా ఉంది. పదేళ్లుగా అధికారులు కలెక్టర్, ప్రజాప్రతినిధులను సంప్రదిస్తున్నా ఫలితం లేదు. ఫలితంగా ఉపకేంద్రం ఏర్పాటు అంశం ప్రతిపాదనలకే పరిమితమైంది.



★ ప్రకృతి వైపరీత్యాల సమయంలో శ్రీకాకుళం నగరంలోని ఈపీడీసీఎల్ కార్యాలయం నుంచే ఉన్నతాధికారులు సరఫరా పునరుద్ధరణ, సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఆయా సందర్భాల్లో నగరానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని చిలకపాలెం, అంపోలు ఉపకేంద్రాల నుంచి ప్రత్యామ్నాయంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు.

★ జిల్లా కేంద్రంలో విద్యుత్తు డి-1 డి-2 డి-3 సెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 90 వేలకు పైగా కనెక్షన్లు ఉన్నాయి. నగరం విస్తరిస్తుండటంతో పెద్ద ఎత్తున భవనాలు నిర్మిస్తున్నారు. గృహావసరాలకు సంబంధించిన సర్వీసులు పెరుగుతుండటంతో లోవోల్టేజీ, హైవోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఉపకరణాలు కాలిపోతున్నాయి.

★ భారీ వర్షాలు, తుపానుల సమయంలో జిల్లాలోని 30 మండలాల పరిధిలో విద్యుత్తు స్తంభాలు నేలకూలడం, చెట్లు విరిగి తీగలు తెగిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో భారీ నష్టం వాటిల్లుతోంది. జిల్లా కేంద్రంలోనూ సరఫరాకు ఇబ్బంది తలెత్తుతోంది.

ప్రజాప్రతినిధులు సహకరిస్తే మేలు

శ్రీకాకుళం నగరంలో 132 కేవీ ఉపకేంద్రం నిర్మాణం విషయమై ఇటీవల కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు. ఖాజీపేటలో స్థలం ఉందని.. దీన్ని కేటాయించాలని చర్చ జరిగింది. ఇప్పటికే ప్రభుత్వ పురపాలక శాఖకు చెందిన విద్యుత్తు సామగ్రి నిల్వ కేంద్రం, శాంతినగర్ కాలనీ, నవభారత్ జంక్షన్ సమీపంలో స్థలాలను ఈపీడీసీఎల్ అధికారులు పరిశీలించి అనువుగా లేవని తేల్చారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టి సారించి ఖాజీపేట వద్ద స్థలాన్ని ఈపీడీసీఎల్‌కు కేటాయిస్తే ఉపకేంద్రం నిర్మించడానికి మార్గం సుగమం అవుతుంది.

స్థలం కేటాయిస్తే నిర్మిస్తాం..

శ్రీకాకుళం నగరంలో 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించాలి. అవసరం మేరకు స్థలం కేటాయించాలని కలెక్టర్, ప్రజాప్రతినిధులను కోరాం. ఈ ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం.

– నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఈ, ఈపీడీసీఎల్, శ్రీకాకుళం

కోర్టు కానిస్టేబుల్ విధులు కీలకం

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శిక్షల శాతం పెరగడానికి కోర్టు కానిస్టేబుల్ విధులే కీలకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం జిల్లాలో కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్లు, న్యాయస్థానాల మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తూ.. అంకితభావంతో పని చేయాలని సూచించారు. పోలీసుల అలసత్వంతో కోర్టులో విచారణ, అపరిష్కృత కేసులు లేకుండా కోర్టు కానిస్టేబుళ్లు, పర్యవేక్షణ వ్యవస్థకు చెందిన సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సమస్యల కూత..!

● శ్రీకాకుళం రోడ్ రైలు నిలయంలో కనీస వసతులు కరవు
● ప్రయాణికులకు తప్పని అవస్థలు

న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం, గ్రామీణం

జిల్లాలో ప్రధానమైన రైలు నిలయంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో సమస్యలు నెలకొన్నాయి. ఆదాయం ఘనంగా ఉన్నా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం వెనుకంజలోనే ఉంది. కనీస వసతులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌ఫాంపై పైకప్పు లేకపోవడంతో ఎండ, వర్షం సమయంలో అవస్థలు పడుతూ రైలు ఎక్కాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

★ 3, 4 ప్లాట్‌ఫాంలపై మరుగుదొడ్లు లేవు. అవసరమైన వారు రెండో నంబరు ప్లాట్‌ఫాం పైకి రావాల్సిన పరిస్థితి నెలకొంది. రైల్వే శాఖ రూ.కోట్లు ఖర్చు చేసి పెద్ద వంతెన పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో రెండు వైపులా బయటకు వెళ్లేందుకు అవకాశం లేక ప్రయాణికులు, స్థానికులకు ఉపయోగం లేకుండా పోయింది.

★ ప్లాట్‌ఫాంకు టికెట్ కౌంటర్ దూరంగా ఉంది. సామగ్రి తీసుకుని చుట్టూ తిరిగి రైలు వద్దకు చేరుకోవడానికి కొంత సమయం పడుతోంది. ఈక్రమంలో కొన్నిసార్లు రైలు అందుకోలేక ఇంటి బాట పడుతున్నారు.

★ ప్రయాణికులు వాహనాలను పార్కింగ్ స్థలంలో నిలుపుతున్నారు. షెడ్డు లేకపోవడంతో రెండు మూడు రోజుల పాటు అక్కడ ఉంచుతున్నవి దెబ్బతింటున్నాయి.

★ అన్ని ప్లాట్‌ఫాంలపై అవసరం మేరకు తాగునీటి సౌకర్యం లేదు.

★ సామగ్రి భద్రపరిచే గది లేక అవస్థలు పడుతున్నారు.

★ విభిన్న ప్రతిభావంతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన లిఫ్టు పని చేయటం లేదు. ప్లాట్‌ఫాం పైకి వారిని చేరవేయడానికి అవసరమైన వాహనాలు లేవు.

★ గూడ్సు షెడ్డు విశ్రాంతి భవనం దూరంగా ఉంది. కూలీలు పని చేసే ప్రాంతంలో చిన్న షెడ్డులు నిర్మిస్తే వారు సేద తీరడానికి అవకాశం ఉంటుంది.



అభివృద్ధి పనుల్లో భాగంగా క్రేన్ సాయంతో స్తంభాలను అమరుస్తున్న కార్మికుడు

★ రైలు నిలయం ప్రాంగణంలో పూర్తిస్థాయిలో విద్యుత్తు దీపాలు లేవు. రైల్వే పోలీసుల గస్తీ అంతంతమాత్రం కావడంతో కొందరు ఆకతాయిలు రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ప్రయాణికులు భయాందోళనలకు గురై బయటకు పరుగులు తీస్తున్నారు.

★ రైలు నిలయంలో నెలకొన్న సమస్యలను ప్రజా సంఘాల నాయకులు, ప్రయాణికులు, ప్రజలు పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



పూర్తి స్థాయిలో పైకప్పు లేని ప్లాట్‌ఫాం

మరుగుదొడ్లు లేక ఇబ్బందులు



ప్లాట్‌ఫాంపై పూర్తిస్థాయిలో తాగునీటి కుళాయిలు, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. పైకప్పు లేకపోవడంతో ఎండ, వాన సమయంలో రైలు ఎక్కడానికి అవస్థలు తప్పడం లేదు.

– పైడి మురళి, సరుబుజ్జిలి

అన్ని రైళ్లు ఆగితే బాగుంటుంది..



శ్రీకాకుళం రోడ్ రైలు నిలయం మీదుగా నిత్యం సుమారు 100 రైళ్లు వెళ్తాయి. అందులో సగానికి పైగా ఆగడం లేదు. విశాఖపట్నం, విజయనగరం వెళ్లి ఎక్కాల్సి వస్తోంది. స్థానికంగా ఏర్పాటు చేసిన రైల్వే అంతర్గత మార్గంలో నీరు నిల్వ ఉండకుండా రైల్వే అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

– బోనెల అప్పారావు, ప్రజా సంఘాల నాయకుడు, ఆమదాలవలస

రూ.24 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం..

అమృత్ భారత్‌లో భాగంగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.24 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే ప్రయాణికులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. 3, 4 ప్లాట్‌ఫాంల నుంచి 1, 2 ప్లాట్‌ఫాంలకు వెళ్లడానికి ప్రయాణికులు, వృద్ధుల కోసం వంతెన నిర్మించి లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నాం. నూతన హంగులతో బుకింగ్ కార్యాలయం, విశ్రాంతి భవనాలు, వాహనాలు నేరుగా ప్లాట్‌ఫాంపైకి వచ్చేలా పనులు జరుగుతున్నాయి. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – ఎం.రవి, మేనేజర్, శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్

★ మొత్తం ప్లాట్‌ఫాంలు 4	★ రోజుకు ఆగే రైళ్లు 48	★ నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు సుమారు 10 వేలు	★ రోజుకు సమకూరే ఆదాయం రూ.3 లక్షలు	★ సరకు రవాణా ద్వారా నెలకు రూ. 3 కోట్లకు పైగా

అల్పపీడనంతో భారీ వర్ష సూచన



కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆర్డీవోలు, జిల్లా, మండల స్థాయి, ఇతర అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఉత్తర కోస్తా జిల్లాల్లో సాధారణ నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని. ఈ నెల 21 నుంచి అధికారులందరూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. చెరువులను పరిశీలించి ఎక్కడైనా ప్రమాదకరమైన పరిస్థితులు ఉంటే గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఇబ్బంది తలెత్తితే జిల్లా స్థాయి కంట్రోల్ రూం నంబరు 08942 240557కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు బయటకు రాకుండా చూడాలని స్పష్టం చేశారు. నదీ ప్రవాహాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. మండల స్థాయిలో పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు సమాయత్తం కావాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి వీఆర్వోలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, రెవెన్యూ, పురపాలక, పశుసంవర్ధక శాఖ అధికారులు వారి పరిధిలో చేపట్టాల్సిన చర్యలకు తక్షణమే ఉపక్రమించాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అడ్డుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో బెజ్జిపురం జూట్ ఉత్పత్తులు

ఎచ్చెర్ల(లావేరు), న్యూస్‌టుడే: లావేరు మండలం బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు తయారు చేస్తున్న జూట్ ఉత్పత్తులను ఆన్‌లైన్ విపణిలో కొనుగోలుదారులకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. బెజ్జిపురంలో మహిళలు తయారు చేస్తున్న జూట్ ఉత్పత్తులు, బుడతవలసలో అతివలు ఏర్పాటు చేసిన బియ్యం మిల్లు, రణస్థలంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు రూపొందిస్తున్న ఉయ్యాలలు, పొందూరులో ఉత్పత్తి చేస్తున్న పీవీసీ పైపులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జీవనోపాధుల డీపీఎం బి.నారాయణరావు, ఏపీఎం బీవీ సుబ్బయ్యనాయుడు, సీసీ గురుబాల, విజయకుమారి తదితరులు ఉన్నారు.



సంచులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఇతర అధికారులు

పోషక బియ్యం మరో నాలుగేళ్లు..!

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, సోంపేట

ఆహార భద్రత చట్టం అమలులో భాగంగా అందజేస్తున్న పోషక బియ్యం మరో నాలుగేళ్ల పాటు ఉచితంగా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొవిడ్ సమయంలో ఆర్థికంగా ఇబ్బందులకు గురైన పేదలను ఆదుకునేందుకు కేంద్రం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) కింద ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. 2021 నుంచి మూడు నెలలకు ఒకసారి పథకాన్ని పొడిగిస్తోంది. గత డిసెంబరులో ఏడాది పాటు ఉచిత బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది. ఈ గడువు మరో రెండు నెలల్లో ముగియనుంది. ఇటీవల కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మరో నాలుగేళ్ల పాటు ఉచిత బియ్యం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. 2028 డిసెంబరు వరకు ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో జిల్లాలో కొన్ని లక్షల మందికి ప్రయోజనం కలగనుంది.

జిల్లాలో చౌక దుకాణాలు	1,625
ఎండీయూ వాహనాలు	422
రేషన్ కార్డులు	6,71,803
లబ్ధిదారులు	19,77,698
తెల్ల కార్డులు	6,35,471
లబ్ధిదారులు	18,80,952
అంత్యోదయ	36,332
లబ్ధిదారులు	96,746
ప్రతి నెల బియ్యం కేటాయింపు	9,737 టన్నులు



పీఎంజీకేఏవైలో భాగంగా జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోని కార్డులకు కేంద్రం ఉచిత బియ్యం పంపిణీ చేస్తోంది. మిగిలిన కార్డులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. గతంలో లబ్ధిదారులకు సార్టెక్స్, నాన్ సార్టెక్స్ బియ్యం పంపిణీ చేస్తుండగా కేంద్రం ఆదేశాలతో గతేడాది సెప్టెంబరు నుంచి పోషక బియ్యం పంపిణీ ప్రారంభించారు. సార్టెక్స్ బియ్యంలో 15 శాతం, నాన్‌సార్టెక్స్‌లో 25 శాతం వరకు నూకలు ఉంటాయి. గతంలో వీటినే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసేవారు. పోషక బియ్యం పంపిణీ చేయాలనే లక్ష్యంతో 100 కిలోల సార్టెక్స్ బియ్యంలో యంత్రాలతో కిలో కెర్నల్ (పోషకాహారం) కలిపి పంపిణీ చేస్తున్నారు. ఈ బియ్యంలో విటమిన్ బి-12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ ఉంటాయి. ప్రతి లబ్ధిదారుకు నెలకు ఐదు కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోని పీఎంజీకేఏవై కార్డుదారులకు 2028 వరకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తారు. లబ్ధిదారులందరికీ పోషక బియ్యం అందుతాయి. పోషక విలువలతో కూడిన బియ్యాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– జి.సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం

పుష్కరిణి.. శుభ్రతకు దూరం

ఆమదాలవలస పట్టణం మొనింగివారి వీధిలోని అయ్యప్ప దేవాలయం ఆవరణలోని పుష్కరిణిలో చెత్త పేరుకుపోయి నీరు రంగు మారి దుర్వాసన వ్యాపిస్తోంది. కొందరు పాలిథిన్ కవర్లు, వ్యర్థాలను పడేస్తుండటంతో కలుషితమవుతోందని స్థానికులు చెబుతున్నారు. వారంలో రెండు మూడు సార్లు పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తొలగించే వారని.. ప్రస్తుతం పనులు చేయడం లేదని తెలిపారు. కార్తిక మాసం ప్రారంభమయ్యే నాటికి పుష్కరిణిని శుభ్రం చేసి భక్తులకు అందుబాటులో తీసుకురావాలని కోరుతున్నారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ పి.బాలాజీప్రసాద్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టి పుష్కరిణి, దేవాలయ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



ఆదిత్యుని ఆదాయం రూ.3.72 లక్షలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లిలో సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పలువురు కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించారు. ఇంద్రపుష్కరిణిలో పుణ్యస్నానం అనంతరం ఆదిత్యుని దర్శించుకున్నారు. గోశాలలో పూజలు చేశారు. దర్శన టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, ప్రత్యేక పూజల రూపంలో రూ. 3.72 లక్షల ఆదాయం సమకూరింది. ప్రసాదాల కౌంటర్లు, క్యూలైన్లలో తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

ఇద్దరు బాలికలపై అత్యాచారం

★ ఫిర్యాదు చేయడానికి ముందుకు రాని బాధితులు

★ రాజీ కుదర్చడానికి పెద్దల యత్నం

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గలో ఇద్దరు బాలికలపై అత్యాచారం జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. బాధితుల కుటుంబ ఆర్థిక పరిస్థితిని ఆసరాగా తీసుకుని రాజీ కుదర్చడానికి కొందరు పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రాని పరిస్థితి నెలకొంది. కాశీబుగ్గకు చెందిన సుమారు 16 ఏళ్ల వయసు గల ముగ్గురు బాలికలు, నేతాజీనగర్, సూదికొండ ప్రాంతాలకు చెందిన ముగ్గురు యువకులు ఈ నెల 19న (శనివారం) రాత్రి పుట్టిన రోజు వేరిట వేడుక నిర్వహించుకోవడానికి కోసంగిపురం సమీపంలోని జగనన్న కాలనీకి వెళ్లారు. అక్కడ ఓ ఇంట్లో యువకులు మద్యం తాగారు. బాలికలు కూడా వారితో జత కూడారని సమాచారం. భోజనం అనంతరం ఇద్దరు బాలికలపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. మరో బాలికపై ఒక యువకుడు అత్యాచారానికి యత్నించగా ఆమె ప్రతిఘటించింది. ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడుతుండగా మరొకరు సెల్‌ఫోన్లో వీడియో తీశాడు. రాత్రి 11 గంటల తరువాత అందరూ కలిసి ఇళ్లకు చేరుకున్నారు. అత్యాచారానికి గురైన ఓ బాలిక జరిగిన ఘటనను ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో చెప్పింది. విషయం బయటకు తెలియడంతో యువకుల కుటుంబీకులు స్థానికంగా కొందరు పెద్దలతో రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారని సమాచారం. కాశీబుగ్గ సీఐ డి.మోహనరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఈ వ్యవహారాన్ని చైల్డ్ లైన్ దృష్టికి తీసుకెళ్లామని.. వారు విచారణ చేసి ఇచ్చే నివేదిక ఆధారంగా కేసు నమోదుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రభుత్వ సేవలు పొందడం ప్రజల హక్కు


మాట్లాడుతున్న ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టం, గ్రామ సభల నిర్వహణపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురం గ్రంథాలయంలో ఆదివారం స.హ.చట్టం, గ్రామసభల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సేవలను పొందడం ప్రజల హక్కు అని, సద్వినియోగం చేసుకోలేక అవస్థలు పడుతున్నారన్నారు. వీటిపై ప్రజలకు విషయ పరిజ్ఞానం పెంపొందిస్తే గ్రామాలు, రాష్ట్రాలు, దేశాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఐక్యవేదిక శ్రీకాకుళం గ్రామీణ మండలం కన్వీనర్‌గా శిమ్మ రాజారావు, కో-కన్వీనర్‌గా నక్క లక్ష్మణరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నవంబరు 17వ తేదీన గ్రామీణ మండలం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

ఆశయం ఉన్నతం.. ఆచరణ శూన్యం



ప్రజాప్రతినిధులకు పట్టక పోవడం.. అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడం వెరసి కోట్ల రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు అయింది. వందల మంది విద్యార్థులకు వసతి కల్పించాల్సిన భవనం నిరుపయోగంగా మారింది. పట్టించుకునే నాథుడు లేక సామగ్రి అంతా చోరుల పాలైంది. గ్రామానికి శివారు ప్రాంతంలో ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇదీ పాతపట్నంలో ఉన్న ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న బాలికల వసతి గృహం పరిస్థితి. గతంలో ఎంతో ఉన్నత ఆశయంతో రూ.3 కోట్లతో దీనిని నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసి రెండేళ్లు దాటుతున్నా ప్రారంభించలేదు. దీంతో ఏడాది కాలం నుంచి భవనంలో ఉన్న ఫర్నిచర్, ఫ్యాన్లు, నీళ్ల ట్యాపులు, విద్యుత్తు పరికరాలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. తలుపులు పూర్తిగా పాడయ్యాయి. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాములు తెలిపారు.

– న్యూస్‌టుడే, పాతపట్నం

ఉత్తమ ప్రదర్శనగా 'నిర్జీవ నినాదం'


పురస్కారం అందుకుంటున్న 'నిర్జీవ నినాదం' నాటిక నటులు, దర్శక, రచయితలు

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: బాపూజీకళా మందిరంలో సూత్రాఫౌండేషన్, సుమిత్ర కళాసమితి సంయుక్త నిర్వహణలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. కెరటాలు, సప్తమ సూత్రం నాటికల ప్రదర్శనతో పాటు ఉత్తమ ప్రదర్శనగా 'నిర్జీవ నినాదం', ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా 'సప్తమ సూత్రం', ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా 'కొండగాలి' నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ రచనకు స్నిగ్ధ (కొండగాలి నాటిక), ఉత్తమ దర్శకత్వానికి బి.ఎం.ఎస్.పట్నాయక్(నిర్జీవనినాదం) అవార్డులు అందుకున్నారు. ఉత్తమ నటీనటులు, అలంకరణ, సంగీతానికి సైతం అవార్డులు దక్కాయి.

విరాళాలేమయ్యాయ్..?

● ఖాతాకు జమకాని నిత్యాన్నదాన వితరణ సొమ్ము
● సమగ్ర విచారణ చేపడతామన్న దేవాదాయశాఖ అధికారులు


ఆలయంలో అన్నదానకార్యక్రమం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మకమైన కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి దేవస్థానంలో భక్తుల రద్దీదృష్ట్యా కొన్నేళ్ల క్రితం నుంచి వారంలో ప్రతి మంగళవారం, గురువారం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. ఇందుకు ప్రతి వారం కొంతమంది భక్తులు విరాళం అందిస్తారు. ఈ విధంగా వారానికి రూ.40 నుంచి రు.45 వేల వరకు వస్తుంది.

ఆ డబ్బు ఏమైందో

భక్తుల విరాళాల రూపంలో ఎక్కువ మొత్తం వస్తుండటంతో వారానికి రెండు రోజులు కాకుండా నిత్యాన్నదానం చేయాలని భావించారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సైతం ఈ కార్యానికి రు.లక్ష అందజేశారు. విరాళాల ఖాతాలో 2023 మార్చి నాటికి రూ 22.50 లక్షలు ఉండగా ఆ తరువాత నుంచి అందజేసిన విరాళాలు ఖాతాకు జమకాలేదు. 2024లో తెలంగాణకు చెందిన విశ్రాంత ఏఎస్ఐ నిత్యాన్నదానానికి చదివించిన రూ 11,116లు మాత్రమే జమ అయింది. గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది ఏఎస్ఐ విరాళం మినహా మిగతా నెలల్లో భక్తులు అందజేసిన వితరణ సొమ్ము ఏమైందో తెలియడం లేదు.

తక్షణ చర్యలు చేపడతాం

మంత్రి అచ్చెన్నాయుడు నిత్యాన్నదానానికి అందించిన రు.లక్ష సైతం ఖాతాకు జమకాలేదు. ఆడిటింగ్‌లో తప్పులు జరిగిన మాట వాస్తవమే. పరిశీలించి, ఖాతాలకు విరాళాలు జమ అయ్యేట్లు తక్షణ చర్యలు తీసుకుంటాం.

-వాకచర్ల రాధాకృష్ణ, ఈవో, కొత్తమ్మతల్లిదేవస్థానం


పునరావృతం కాకుండా చూస్తాం

నిత్యాన్నదానానికి భక్తులు సమర్పించిన వితరణ వివరాలు, జమ కావడంలో ఎదురైన సమస్యలపై సమగ్ర విచారణ చేపడతాం. మరోసారి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

–ప్రసాద్ పట్నాయక్, సహాయకమిషనర్, దేవాదాయధర్మాదాయశాఖ, శ్రీకాకుళం

వీరులారా.. మీ త్యాగాలకు సలాం..!

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



సమాజంలో శాంతి స్థాపనకు జరిపిన పోరులో అసువులుబాసిన పోలీసుల త్యాగం సదాస్మరణీయం. ఏ బంధుత్వమూ లేకపోయినా.. ప్రజా రక్షణే తన విధి అని ఉద్యోగంలో చేరిన నాడు చేసిన ప్రతిజ్ఞను మరవక.. మావోయిస్టుల కార్యకలాపాలను అడ్డుకోవడానికి చివరి క్షణం వరకు పోరాడిన తీరు అజరామరం

–న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

మందుపాతర పేలి



పొందూరు మండలం లోలుగు గ్రామంలో 1976 సంవత్సరంలో ఏప్రిల్ 15న మజ్జి చిన్నవాడు దంపతులకు ఎం.వెంకటరమణ జన్మించారు. నిరుపేద కుటుంబమైనప్పటికీ కష్టపడి చదివి 1998లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. స్పెషల్‌పార్టీలో చురుకైన పాత్ర పోషించేవారు. 2001లో అక్టోబర్ 27న నులకజోడు గ్రామంలో అర్ధరాత్రి సుమారు 200 మంది మావోయిస్టులు రైస్‌మిల్లులోని బియ్యం బస్తాలు ఎత్తుకెళ్లి పోయారు. సమాచారం అందడంతో స్పెషల్‌పార్టీ ఆ ప్రాంతంలో గాలింపులు చేపట్టింది. ఈ క్రమంలో నడిమిగూడ వద్ద వీరి రాకను గమనించిన మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో వెంకటరమణ మృతిచెందారు.

పట్టుకునేందుకు వెళ్లి..



జిల్లాలో తొలిసారిగా 1992లో మావోయిస్టుల ఘాతుకానికి ఎస్ఐ బంగారునాయుడు బలయ్యారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం గుణుపూరుపేటకు చెందిన ఆయన బారువ, కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో పని చేశారు. మందస మండలం రట్టి, బేతాళపురం గ్రామాల మధ్య ఉన్న కొండల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో వారిని పట్టుకునేందుకు బంగారునాయుడు వెళ్లారు. రాకను పసిగట్టిన ఉద్దానం దళ సభ్యులు మార్చి 23న జరిపిన కాల్పుల్లో బంగారునాయుడు ప్రాణాలు విడిచారు.

కాల్పులు తిప్పికొట్టి..



పలాస మండలం నీలిభద్రలో ఒక వ్యక్తిని హతమార్చి అతడి ఆస్తిని దోచుకోవాలని మావోయిస్టులు వ్యూహం పన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సదరు వ్యక్తిని రక్షించేందుకు ఇంటివద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఇన్‌ఛార్జిగా హెడ్ కానిస్టేబుల్ అన్నెపు పాపారావు వ్యవహరించారు. 1997లో జూలై 17న అర్ధరాత్రి వేళ అనుకున్నట్లుగానే ఇంటిపై తుపాకులతో విరుచుకుపడ్డారు. వెనక్కి తగ్గని పాపారావు ఎదురుదాడికి దిగారు. శక్తిమేర కాల్పులను తిప్పికొట్టినా.. వారి తూటాలకు నేలకొరిగారు.

ముప్పుతిప్పలు పెట్టారు



ఎప్పటికప్పుడు తమ సమాచారాన్ని సేకరిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ నరేంద్ర దాస్‌ను మావోయిస్టులు మట్టుబెట్టాలనుకున్నారు. అయినా వెనక్కి తగ్గని దాస్ వారి ఉద్యమాలను నీరుగార్చి ముప్పుతిప్పలు పెట్టేవారు. వారి కదలికలను గుర్తించి నిరోధించడంలో సఫలీకృతమయ్యేవారు. సహించలేక 1997 మార్చి 17న కాశీబుగ్గలో దైవ దర్శనానికి వెళ్లిన ఆయనను రివాల్వర్‌తో కాల్చి చంపారు.

దారి కాసి మట్టుబెట్టి



మావోయిస్టుల కార్యకలాపాల సమాచార సేకరణలో ఆరితేరిన కృష్ణమూర్తిని దారి కాసి మట్టుబెట్టారు. 1970 మార్చి 15న సంతకవిటి మండలం వాల్తేరులో పి.బోడయ్య దంపతులకు కృష్ణమూర్తి జన్మించారు. 1993లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. మావోయిస్టుల ఏరివేతలో చురుకైన పాత్ర పోషిస్తూ, శాంతి భద్రతలను పరిరక్షించే కృష్ణమూర్తిని 2005 జూన్ 5న మందస మండలం హరిపురం కూడలిలో వెనక నుంచి దాడిచేసి కాల్చి చంపారు.

జూన్‌లో సిరిమానోత్సవం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాతశ్రీకాకుళంలో పదేళ్లకు ఒకసారి జరిగే సిరిమానోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ దేవతల సిరిమానోత్సవం కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో పెద్దమ్మగుడి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను ప్రకటించారు. వచ్చే సంవత్సరం జూన్‌నెలలో సిరిమానోత్సవం నిర్వహించేందుకు పెద్దలు నిర్ణయించారని ఆయన తెలిపారు. సోమవారం చెట్లకు బొట్టు పెట్టే కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సిరిమానోత్సవ కమిటీ ప్రతినిధులు

ప్రైవేటా...మజాకా...!

సామాజిక మాధ్యమాల్లో సత్కార చిత్రాలు చక్కర్లు


కోటబొమ్మాళి: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటువ్యక్తి సత్కార చిత్రం

కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు, పోలాకి (కొంతభాగం) వంటి వాటికే కాకుండా అనేక ప్రాంతాలకు కేంద్రమైన కోటబొమ్మాళి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేట్ (నకిలీ) వ్యక్తుల హల్‌చల్ చేస్తున్నారనేందుకు ఈచిత్రం ఉదాహరణ. కార్యాలయంలో నగదు లావాదేవీలు చూసే వ్యక్తి (ఇప్పటికీ) ప్రభుత్వ కార్యాలయం ఆవరణలో తనకు తానుగా చేసుకున్న సత్కార చిత్రాలు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల అధికారులు, గత ఎస్ఆర్వో రాజుల బదిలీ సత్కారాలు జరిగాయి. ఆ కార్యక్రమాల అనంతరం ఈ సంఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వకార్యాలయం అనే భయం లేకుండా సత్కారాలు చేయించుకుని వాటి చిత్రాలు తీసి మరీ పోస్టులు చేశారు. ఇవి పలు గ్రూపుల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ★ ప్రభుత్వం ఇప్పటికైనా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రైవేటు దందాను కట్టడి చేయాలని అనేకమంది విజ్ఞప్తిచేస్తున్నారు.

● ఈవ్యవహారంపై ప్రస్తుత సబ్‌రిజిస్ట్రార్ పీవీ రమాపతిని ప్రశ్నించగా సత్కార చిత్రాల విషయం తమ దృష్టికి వచ్చిందని, సమగ్రంగా విచారిస్తామని స్పష్టంచేశారు. ఇదిలావుండగా ఇటీవల పలు రిజిస్ట్రేషన్లలో నకిలీ ధ్రువపత్రాలు కనిపించడానికి కారణం వీరేనన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. –న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

దూసుకొచ్చిన మృత్యువు

★ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న లారీ ★ ఇద్దరు దుర్మరణం


తియ్యాల భవ్య (పాతచిత్రం)


నక్క రామారావు (పాతచిత్రం)

నరసన్నపేట, న్యూస్‌టుడే: వివాహ వేడుకల్లో ఆనందంగా గడిపిన ఆ ఇద్దరిని రోడ్డు ప్రమాదంలో లారీ కబళించింది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంలో ఆ ఊరిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానిక సత్యవరం కూడలి సమీపంలో జాతీయ రహదారి పైవంతెన వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలాకి మండలం జిల్లేడువలస గ్రామానికి చెందిన నక్క రామారావు (48), అదే గ్రామానికి తియ్యాల భవ్య (17) ఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. . శ్రీకాకుళం సమీపంలోని పరదేశిపాలేంలో వివాహ వేడుకల్లో పాల్గొన్న రామారావు, భవ్య ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా ఘటన చోటు చేసుకుంది. మిరపకాయల లోడుతో వస్తున్న లారీ వారిని ఢీకొట్టి, వాహనాన్ని కొంత దూరం లాక్కెళ్లింది. ఇదిలా ఉండగా, నక్క రామారావుతో పాటు భవ్య తండ్రి గౌరేషు ఈ వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లారు. కుమార్తెకు సోమవారం పరీక్ష ఉండటంతో గౌరేషు ఉండిపోయి కుమార్తె భవ్యను ద్విచక్రవాహనంపై రామారావుతో పంపించారు. తన నిర్ణయం వల్లే కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని తండ్రి విలపించారు. నక్క రామారావుకు భార్య ముత్యాలమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నరసన్నపేట ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

కేసు ఛేదించిన సోంపేట పోలీసులు

సోంపేట, న్యూస్‌టుడే : సోంపేట, మందస పోలీసుస్టేషన్లలో ఇటీవల నమోదైన చోరీ కేసులకు సంబంధించి సీఐ మంగరాజు, ఎస్సై బి.హైమావతి ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించి నిందితుడిన పట్టుకున్నారు. అతడి నుంచి 10.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోంపేటకు చెందిన కోల కిరణ్ జూదానికి అలవాటు పడ్డాడు. యూట్యూబ్ ఆధారంగా తాళాలు ఎలా పగలగొట్టాలో చూసి నేర్చుకున్నాడు. ఈ నెల 5న మందస మండలం కొత్తపల్లి మెయిన్ రోడ్డులో ఉన్న ఓ ఇంట్లో చోరీకి యత్నించాడు. అక్కడ ఏమీ లభించకపోవడంతో సోంపేటలో చిన్న కోమటి వీధిలోని కొంచాడ అర్చన ఇంట్లో బంగారు వస్తువులు ఎత్తుకెళ్లాడు. ఈ నెల 10న మందస మండలం సొండిపూడిలో ఎదురెదురుగా ఉన్న రెండు ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడ్డాడు. ఆదివారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించి పట్టుకున్నందుకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సీఐ, ఎస్సైలను అభినందించారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

శ్రీకాకుళం గ్రామీణం, నూస్‌టుడే : బాలుడు అదృశ్యంపై శ్రీకాకుళం గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైనట్లుగా ఎస్ఐ రాము తెలిపారు. శ్రీకాకుళం గ్రామీణ మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలుడు ఈ నెల 16వ తేదీ నుంచి కనిపించడం లేదని అతడి తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆదివారం ప్రకటలో పేర్కొన్నారు. బాలుడు నాలుగు అడుగుల మూడు అంగుళాల ఎత్తు ఉంటాడని, పాఠశాల ఏకరూప దుస్తులైన తెలుపు చొక్కా, నీలం రంగు ప్యాంటుతో అదృశ్యమైనట్లు వెల్లడించారు. వివరాలు తెలిసిన వారు 94490533820(ఎస్సై), 6309990845(సీఐ) నంబర్లకు సంప్రదించాలన్నారు.

అంతర జిల్లాల దొంగ అరెస్టు

నిందితుడిపై 30 కేసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో అరసవల్లి రోడ్డు తెలుగు ముసలయ్య కాలనీకి చెందిన వడ్డి సుజాత మెడలో నల్లపూసల గొలుసు తెంచి పరారైన నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఆదివారం వివరాలు వెల్లడించారు. నిందితుడు విశాఖపట్నంలోని కంచరపాలెం సుభాష్‌నగర్‌కు చెందిన భీమరశెట్టి కమలానాథ్‌గా గుర్తించారు. ఇతడిపై 30 కేసులు ఉన్నట్లు తెలిపారు. మెకానిక్ దుకాణంలో పని చేసి ద్విచక్రవాహనాలను తాళాలు లేకుండా స్టార్ట్ చేయడం నేర్చుకుని ద్విచక్రవాహనాలు, బంగారు గొలుసులు దొంగలించడం ప్రారంభించాడని, బంగారాన్ని ఓ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో జల్సా చేసేవాడని వెల్లడించారు. ఈ క్రమంలో సామర్లకోట పోలీసులకు చిక్కడంతో అరెస్టయ్యాడన్నారు. ఆ తరువాత విడుదలైనా.. ప్రవర్తన మార్చుకోలేదని, కంచరపాలెం, అనకాపల్లి, విజయనగరం 2 టౌన్, శ్రీకాకుళం రూరల్, జామి, కొత్తవలస, అరిలోవ, అనపర్తి, ఎచ్చెర్ల, పెందుర్తి, సబ్బవరం, గోపాలపట్నం పోలీసుస్టేషన్లలో సుమారు 30 కేసులు ఇతడిపై నమోదయ్యాయని, 10 సార్లు జైలు శిక్ష అనుభవించినట్లు పేర్కొన్నారు. దొంగిలించి, తాకట్టు పెట్టిన బంగారాన్ని నిందితుడు ఇచ్చిన సమాచారంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఉచిత ఇసుకతో ప్రజల్లో ఆనందం

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనేఅమలు చేసిన మహానేత నారా చంద్రబాబునాయుడని తెదేపా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడుకలమట వెంకటరమణమూర్తి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు ఇచ్చినమాట ప్రకారం ఇసుక ఉచితంగా ఇవ్వడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

నేటితో ముగియనున్న టెట్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఏపీ టెట్ ఈ నెల 3 నుంచి జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహిస్తుండగా సోమవారంతో పరీక్షలు ముగియనున్నాయి. జిల్లాలో ఎచ్చెర్లలోని శివాని ఇంజినీరింగ్ కళాశాల, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, నరసన్నపేటలోని కోర్‌టెక్నాలజీ కంప్యూటర్ సెంటర్ కేంద్రాల్లో జరుగుతున్నాయి. ఎచ్చెర్లలోని రెండు కేంద్రాల్లో ఆదివారం రెండు షిఫ్టుల్లో జరిగిన పరీక్షలకు శివానిలో 340 మందికి 296, వెంకటేశ్వరలో 201 గాను 170 మంది హాజరయ్యారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

మాయికివలసలో ఉద్రిక్తత

భూ వివాదంపై హరేరామ హరేకృష్ణ సభ్యులు, గ్రామస్థుల మధ్య గొడవ


మాయికివలస వద్ద హరేరామ హరేకృష్ణ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దారు రామారావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అశోక్‌బాబు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలం మర్రివలస పంచాయతీ ఎస్టీ మాయికివలస వద్ద శనివారం రాత్రి గ్రామస్థులకు, హరేరామ హరేకృష్ణ సభ్యులకు భూ వివాదంపై జరిగిన గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. ఖరీఫ్‌లో వేసిన వరి పంట చేతికి అందడంతో గ్రామస్థులు కల్లాల్లో యంత్రాలతో నూర్పిడి చేశారు. దానిని గుర్తించిన హరేరామ హరేకృష్ణ సభ్యులు ఈ స్థలం తాము కొనుగోలు చేశామని అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని సర్ది చెప్పారు. రాత్రి సమయంలో హరేరామ హరే కృష్ణ సభ్యులు గ్రామంలోకి వెళ్లడంతో స్థానికులకు వారికి మధ్య మాటా మాట పెరిగి తగాదా జరిగింది. దాంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ అశోక్‌బాబు కేసులు నమోదు చేశారు. ఘటనపై గ్రామస్థులు మాట్లాడుతూ.. హరేరామ హరేకృష్ణ సభ్యులు కులం పేరుతో తమను దూషిస్తూ భయపెట్టారని, ఆడవారిపై చేయిచేసుకొని అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఎల్ఎన్‌పేట మండలానికి చెందిన ఉన్న సత్యనారాయణ గుప్త వద్ద 11.5 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని, మరో 7.5 ఎకరాల ట్రస్టుకు బహూకరించారని హరేరామ హరేకృష్ణ సభ్యులు తెలిపారు. మాకు ఇచ్చిన భూముల్లో నూర్పిడి ఎందుకు చేస్తున్నారని ప్రశ్నిస్తే గ్రామస్థులు కర్రలతో దాడి చేశారని వారు తెలిపారు.

సంయమనం పాటించాలి

మాకివలస గ్రామస్థుల భూముల సమస్య ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని, ఆదివాసీలకు న్యాయం చేస్తామని తహసీల్దారు జె.రామారావు, సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంత వరకు స్థానికులు, హరేరామ హరేకృష్ణ సభ్యులు సంయమనం పాటించాలని వారు సూచించారు. గొడవ నేపథ్యంలో గ్రామానికి చేరుకుని ఇరు వర్గాలతో మాట్లాడారు. మరో వైపు ఘటనను ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ఖండించారు. సమస్య జాతీయ ఎస్టీ కమిషన్, మానవహక్కుల కమిషన్ పరిధిలో ఉన్నప్పటికీ హరేరామ హరేకృష్ణ సభ్యులు దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండు చేశారు.

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా
(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	: 9440437129
పలాస	: 8008574279
కవిటి గ్రామీణం	: 8309638875
పలాస గ్రామీణం	: 7386408926
కంచిలి గ్రామీణం	: 9704568738

సమస్య: ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలి రహదారిపై గుంతలు పడటంతో సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు: **స్థానికులు**

సమాధానం : పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం.

- విక్రమ్, ఏఈ, రోడ్డు అండ్ భవనాల శాఖ, ఇచ్ఛాపురం

సమస్య: ఇచ్ఛాపురం మండల పరిధి కొళిగాం పాఠశాలలో కొన్నిరోజులుగా విద్యుత్తు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నాం.

- నారేంద్రనాథ్ పట్నాయక్, హెచ్ఎం

సమాధానం : త్వరలోనే పరిష్కరిస్తాం.

- గోవింద్‌రావు, ఏఈ, ఇచ్ఛాపురం.

సమస్య: పలాస మండలం కేదారిపురంలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి.

- గ్రామస్థులు

సమాధానం : రెండు రోజుల్లో సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

- వైకుంఠరావు, మండల విస్తరణాధికారి, పలాస

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం గ్రామీణం, పలాస గ్రామీణం

పేద విద్యార్థులకు చేయూత



పలాస మండలం రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యా విహార్ కేంద్రంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆదివారం డా. బి. ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయ పూర్వ ఉప కులపతి హనుమంతు లజపతి రాయ్ చెరో రూ. 34 వేల చెక్కులు అందజేశారు. సత్యసాయి అవతార దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఆ సంస్థ ఛైర్మన్ ఎం. రామేశ్వరరావు, ప్రిన్సిపల్ ప్రీతి చౌదరి తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

పల్లె పండగతో ప్రగతి సాధ్యం



బాలకృష్ణాపురంలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం గ్రామీణం, పలాస గ్రామీణం, సోంపేట, కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే : పల్లె పండగతో ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ పేర్కొన్నారు. మండల పరిధి కేదారిపురం, ముచ్చింద్ర, బాలకృష్ణాపురం గ్రామాల్లో పల్లె పండగ వారోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ● ఇచ్ఛాపురం పురపాలక పరిధి 23వ వార్డు బెల్లుపడ కాలనీలో పాల్గొన్న ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త దాసరి రాజు, పురపాలక అధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, కొండా శంకర్ తదితరులు పాల్గొన్నారు. ● పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా పలాస మండలంలోని చినంచల, లొద్దభద్ర, బొడ్డపాడు, మాకన్నపల్లి, నీలావతి, మామిడిమెట్టు, గురుదాసుపురం పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గౌతు శిరీష, అధికారులు శంకుస్థాపన చేశారు.



పలాస మండలం చినంచలలో ఎమ్మెల్యే గౌతు శిరీష, అధికారులు

శిథిల భవనాల్లో సచివాలయాలు

బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు



కాశీబుగ్గ మండల పరిషత్తు కార్యాలయ వీధిలో ప్రమాదకరంగా ఉన్న 10వ వార్డు సచివాలయం

ప్రజలకు పాలన దగ్గర చేయాలనే ఉద్దేశంతో వైకాపా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ఆదరాబాదరగా శిథిల, ఇరుకు భవనాల్లో కార్యాలయాలను ఏర్పాటు చేసింది. కనీసం వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఆ భవనాలు నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. అధ్వాన గదుల్లోనే సచివాలయ ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ సేవలు అందించాల్సి వస్తోంది.

న్యూస్‌టుడే, పలాస

పురపాలక సంఘంలో 16 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 5 వివిధ ప్రభుత్వ, సామాజిక భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగిలిన 11 అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. పురపాలక సంఘం ద్వారా ప్రతి నెల వీటికి అద్దె చెల్లిస్తుండగా రెండు లేదా మూడేళ్లకోసారి మరమ్మతులు లేదా రంగులు వంటివి సంబంధిత యజమానులు వేసి అప్పగిస్తుండాలి. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో సచివాలయాలను అప్పగించిన రోజు నుంచి ఇప్పటివరకు మరమ్మతులు చేసే పరిస్థితి లేకపోవటంతో ఉన్నవాటితోనే సర్దుకుపోవల్సి వస్తోంది.

మరుగుదొడ్ల శుభ్రత లేదు

సచివాలయాల నిర్వహణలో ఒక్కో దగ్గర 5 నుంచి 8 మంది వరకు విధులు నిర్వహిస్తు వీరంతా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లోనే ఉంటారు. మరుగుదొడ్లు వినియోగిస్తున్నా వాటిని శుభ్రం చేసేందుకు సహాయకులు లేకపోవడంతో ఉద్యోగులు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. వైకాపా ప్రభుత్వ హయంలో ఇళ్లను సచివాలయాలుగా ఎంపిక చేయడంతో పలుచోట్ల ఇరుకు భవనాల్లోనే సేవలు అందించాల్సి వస్తోంది. ఒకే గదిలోనే ఇద్దరు లేదా ముగ్గురు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.



పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న ప్రహరీ

పరిశీలిస్తాం..

సచివాలయాలను సందర్శించి వసతులు పరిశీలిస్తాం. శిథిల భవనాలు ఉంటే వాటిని వేరే చోటుకు తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎన్.రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉందని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని మండల ప్రత్యేకాధికారి, మత్స్య శాఖ డీడీ శ్రీనివాసరావు, స్థానిక తహసీల్దార్ సీతారామయ్య తెలిపారు. తుపాను నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. పూడిలంక వాసులను సమీప హుకుంపేట ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేశామన్నారు. పలు తుపాను రక్షిత భవనాలు శిథిలావస్థలో ఉండటంతో పరిసర పాఠశాలలో మరిన్ని పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే : ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో విద్యుత్తు నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ గోవిందరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో కార్జివీధి, ఆసుపత్రిరోడ్డు, ఉప్పలవీధి, మంగళవారం పేట, రథంవీధి, పంజా వీధి కూడలిలో విద్యుత్తు సరఫరా ఉండదని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

సీసీ రహదారి నిర్మించరూ..



ఇచ్ఛాపురం పట్టణ పరిధి స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం సమీప వీధిలో మట్టిరోడ్లపై మురుగు నిలిచి ఇబ్బందులు తప్పడంలేదు. కాలువలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సీసీ రహదారితోపాటు ఇరువైపులా కాలువలు నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ నల్లి రమేష్‌కు వివరణ ఇస్తూ..ఆ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇక్కడ స్తంభం ఉంది గుర్తించగలరా?

వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి విద్యుత్తు ఉప కేంద్రం నుంచి బాతుపురం మీదగా చినవంక వైపు 33/11 కేవీ విద్యుత్తు సరఫరా అవుతున్న స్తంభాన్ని ఒంటి మద్రి చెట్టు సమీప తోటలో మామిడి చెట్టు పూర్తిగా కప్పేసింది. విద్యుత్తు తీగలతో పాటు కొమ్మలు చుట్టేసి ఆ ప్రదేశం ప్రమాదకరంగా మారడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. మామిడి కొమ్మలు తొలగించాలని కోరుతున్నారు. పరిశీలించి వెంటనే కొమ్మలు తొలగించే చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఏఈ వెంకటరమణ తెలిపారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు



పగలూ వెలుగులే..

కంచిలి మండలం ఎస్. ఆర్. సి. పురం పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలు రాత్రి పగలూ తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో దీపాలు వెలగక ఇబ్బందులు పడుతుంటే ఇక్కడ విద్యుత్తును వృథా చేస్తున్నారు. ఈ పరిస్థితి ఎస్. ఆర్. సి. పురం ప్రధాన రహదారిలో నెలల తరబడి కొనసాగుతోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి విశ్వనాథం వివరణ కోరగా ఆ శాఖ జేఎల్ఎంతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు.

– న్యూస్‌టుడే, కంచిలి



పిడుగు పాటుకి కుంగిన బావి

మందస మండలం మకరజోల పంచాయతీ అల్లిమెరక కాలనీలో తాగునీటి బావి రాతికట్ట కొంత భాగం ఒక్కసారిగా కుంగింది. ఆదివారం ఉదయం ఎప్పటిలాగే మహిళలు నీరు తోడేందుకు వెళ్లగా బావి కుంగడం చూసి ఉలిక్కిపడ్డారు. శనివారం రాత్రి వర్షంతో పాటు ఆ ప్రాంతంలో పెద్ద శబ్దంతో పిడుగు పడింది. దాని ధాటికి బావి రాతికట్ట కుంగి ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. స్థానికులకు ఈ బావి నీరే ఆధారం. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రసన్నకుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)



ఎప్పుడు ప్రారంభిస్తారు..?



మందస మండలం సిద్దిగాం పంచాయతీ శ్రీరాంపురం వద్ద రూ.20 లక్షలతో నిర్మించిన గిడ్డంగి ఇది. మందస పీఏసీఎస్ పరిధిలో రైతుల కోసం బహుళ ప్రయోజన సౌకర్యంగా దీన్ని ఏర్పాటు చేశారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవడం లక్ష్యంగా ఏర్పాటు చేశారు. నిర్మాణం పూర్తయి దాదాపు పది నెలలు కావొస్తున్న వినియోగంలోకి రావడం లేదు. ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.సూర్యారావు తెలిపారు.

– న్యూస్‌టుడే, మందస

సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ ఆర్థిక నిపుణులు కె.రవి

హరిపురం (మందస), న్యూస్‌టుడే : 'పలాస నియోజకవర్గంలో జీవ నదులను వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. వంశధారను మందస వరకు పొడిగించి మండలంలోని జలాశయాలకు అనుసంధానం చేయాలి' అని వ్యవసాయ ఆర్థిక నిపుణుడు, రైతు స్వరాజ్య వేదిక వ్యవస్థాపకుడు కన్నెగంటి రవి డిమాండు చేశారు. మందస మండలం హరిపురంలో నియోజకవర్గ స్థాయి రైతు సదస్సును ఆదివారం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడతూ.. పలాస డివిజన్ వెనుకబాటుకు కారణాలను పేర్కొంటూ పరిష్కార మార్గాలను సూచించారు. జీడిమామిడి, కొబ్బరి బోర్డులను స్థానికంగా ఏర్పాటు చేయాలని తద్వారా ఆయా పంటల ఉత్పత్తులను మద్ధతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధికి మందసలో ఐటీడీఏ ఉప కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. వక్తలు పెద్ద కృష్ణారావు, ఎం. మాధవరావు, బి. కామేశ్వరరావు, జి. చలపతిరావు, ఎం. ముకుందరావు, డి. శ్రీరాములు, ఎం. బాబూరావు, టి. త్రిలోచన పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

స్పందనకు వందనం

వజ్రపుకొత్తూరు మండలం పూండి నుంచి పీఎంపురం మీదుగా మంచినీళ్లపేట వరకు ఉన్న బీటీ రోడ్డు అధ్వానంగా మారడంపై ఈ నెల 20న ఈనాడులో 'అడుగుకో గుంత' శీర్షికన వచ్చిన కథనంపై సంబంధిత అధికారులు స్పందించారు. రోడ్డు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కింద రూ. 90 లక్షలు మంజూరు కావడంతో రహదారికి ఇరువైపుల పొదలు తొలగించే పనులు చేపట్టారు. బెర్ములు ఏర్పాటు చేసి బీటీ పనులు ప్రారంభించనున్నట్లు శాఖ జేఈ జగదీశ్ పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం



నిమ్మాడలో ఎర్రన్న వర్ధంతి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడిని స్మరించుకుంటూ ఆదివారం ఆయన వర్ధంతి (తిథి ప్రకారం) కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు నిమ్మాడలో నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, సోదరులు ప్రభాకరరావు, హరి వరప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యురాలు లలితకుమారి, కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా కృషి చేయాలి



అక్కుపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని అక్కుపల్లి బాలుర మత్స్యకార గురుకుల పాఠశాలను ఆదివారం ఆ విభాగం రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్ సందర్శించారు. పాఠశాల దస్త్రాలు, వసతులను పరిశీలించారు. ఉత్తమ ఫలితాల లక్ష్యంగా కృషి చేయాలన్నారు. క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవర్చుకొని ఉత్తమ పౌరులగా ఎదగాలని విద్యార్థులను సూచించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రిన్సిపల్ ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత రక్తదానం



మందస మండలం హరిపురంలోని శాతవాహన డిగ్రీ కళాశాలలో పవనపుత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సంఘం సభ్యులు రక్తదానం చేశారు. సంఘం అధ్యక్షుడు మజ్జి భాస్కరరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

ఘనంగా అవతార ప్రకటన దినోత్సవం

పలాస, న్యూస్‌టుడే: సత్యసాయి బాబా అవతార ప్రకటన దినోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. పలాస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం బాబా పల్లకీని పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం మందిర ప్రాంగణంలో శ్రీకృష్ణ, రాధ, గోపికల వేషధారణలతో బాలవికాస్ చిన్నారులు నాటిక ప్రదర్శించారు. కన్వీనర్ డి. జగదీష్, జోనల్ కన్వీనర్ బైరాగి, సాధన శిబిరం ఇన్‌ఛార్జి జె. సి. హెచ్. శ్రీనివాసరావు, సత్యసాయి విద్యావిహార్ ట్రస్ట్ ఛైర్మన్ మల్లా. రామేశ్వరరావు, సాయి భక్తులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న సేవాసమితి సభ్యులు

వణికిస్తున్న అల్పపీడనం

తుపాన్ హెచ్చరికలతో ఆందోళనలో అన్నదాతలు

న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం, సోంపేట

అక్టోబరు వచ్చిందంటే చాలు అన్నదాత గుండెల్లో గుబులు మొదలవుతుంది. ఈ నెలలో అండమాన్ నికోబార్ దీవుల్లో పదుల సంఖ్యలో అల్పపీడనాలు నుంచి వాయుగుండాలు ఏర్పడి చాలా వరకు సముద్రంలోనే బలహీనపడుతుంటాయి. కొన్ని సందర్భాల్లో మాత్రం అవి తీవ్ర తుపానులుగా రూపాంతరం చెంది అనంతరం తీరం దాటే సమయాల్లో అపార నష్టం కలిగిస్తాయి. గతంలో సంభవించిన సూపర్ సైక్లోన్, హుద్‌హుద్, తిత్లి, ఫైలిన్ తదితర తుపాన్లు ఈ కోవకు చెందినవే.

వర్షంపైనే ఆధారం..

ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో 28 వేల ఎకరాల్లో వరి సాగుచేస్తుండగా 25 వేల మందికి పైగా రైతులున్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయం మొత్తం వర్షంపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం పొలాల్లో నీరు లేకపోవడంతో రైతన్నలు వానల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల 23 నుంచి తుపాను ఉందని వాతావరణశాఖ అంచనాలు వెలువరించడంతో వర్షాలు వస్తాయని ఒక పక్క ఆనందంతో పాటు బలమైన గాలులు వీస్తే ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పొట్ట దశలో ఉన్న వరిచేను

గాలులు వీస్తే పంటకు నష్టం..

3 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. ఎకరాకు సుమారు రూ. 15 వేల వరకు ఖర్చు పెట్టాను. ప్రస్తుం పొట్ట దశలో ఉన్న పైరుకు వర్షాలు చాలా అవసరం. వాయుగుండం కారణంగా వర్షాలు వస్తాయని ఆనందం ఉన్నప్పటికి తుపానుగా మారే క్రమంలో పంటను నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నాం.

– బి.వల్లభరావు రైతు, జాడుపూడి, కంచిలి మండలం

నీరు అవసరం

నియోజకవర్గంలో కవిటి మినహా మిగిలిన మూడు మండలాల్లో ఇసుకనేలలు విస్తరించి ఉన్నాయి. దీని కారణంగా నీరు ఎక్కువ కాలం నిలువ ఉండదు. ప్రస్తుతం 80 శాతం పంటపొలాలకు నీరు అవసరం. ప్రస్తుతం పొట్టదశలో ఉన్న పంటకు బలమైన గాలులు వీస్తే మాత్రం రైతులు నష్టపోతారు. – జగన్మోహనరావు. ఏడీఏ, సోంపేట

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇలా...

మండలం	వరిసాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
ఇచ్ఛాపురం	7,725	6,743
కవిటి	2,698	2,794
కంచిలి	8,734	8,322
సోంపేట	9,039	7,920
మొత్తం	28,196	25,779

బాలుడికి సాయం అందజేత

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం బట్టివానిపాలెం గ్రామానికి చెందిన బాలుడు చీకటి మదన్ మూడు నెలలుగా రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడిది పేద కుటుంబం కావడంతో కవిటికి చెందిన చింతామణి సీ ఫుడ్స్ యూనియన్ సభ్యులు ఆదివారం రూ. 10 వేలను అందజేశారు. యూనియన్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ప్రజలు అనేక సమస్యలపై వినతులు సమర్పిస్తున్న నేపథ్యంలో ప్రతి దానికి పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. నిమ్మాడలో ఆయన కార్యాలయంలో ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టెక్కలిలో అన్న క్యాంటీన్ల నిర్వహణకు శ్రీకాకుళం మోక్షజ్ఞ, ఎన్టీఆర్ సేవాసంఘం ప్రతినిధులు రూ. 20 వేలను మంత్రికి అందచేశారు.

కళాకారుడికి సత్కారం



కుమార్‌నాయక్‌ను సన్మానిస్తున్న వేదిక సభ్యులు

పలాస, పలాస పట్టణం, న్యూస్‌టుడే: తాడేపల్లి గూడెంలో శ్రీశ్రీ కళావేదిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన కళాజాతరలో పలాసకు చెందిన కుమార్‌నాయక్ నటించిన దుర్దశ నాటిక ఉత్తమ బహుమతి పొందింది. ఈ నెల 19, 20 తేదీల్లో జరుగుతున్న కళాజాతరలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు, కళావేదిక ఛైర్మన్ కె. ప్రతాప్ పాల్గొన్నట్లు కుమార్ నాయక్ తెలిపారు. వరల్డ్ రికార్డ్స్ బుక్‌లో దుర్దశ నాటిక నమోదు చేశారని జ్ఞాపిక, ప్రశంసా పత్రాల అందించి సత్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. ● తాడేపల్లిగూడేంలో శ్రీశ్రీ కళావేదిక వారు నిర్వహించిన శతాధిక కవిసమ్మేళనంలో జన జాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కవి తెప్పల కృష్ణమూర్తి 'తరగని ఆస్తులు- మన సంప్రదాయాలు' అనే కవితను వినిపించారు. ఈ సందర్భంగా పురస్కారం అందుకున్నారు.

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? నందిగాం మండలం దేవుపురం పంచాయతీ కొండతెంబూరు గ్రామంలో కాలువలు లేక వర్షం నీరు వీధుల్లో నిల్వ ఉండి పోతుంది. దోమలు, దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం.

- తమ్మినేని సుందరరావు, గ్రామస్థుడు

● పంచాయతీ సర్పంచి దృష్టికి సమస్యను తీసుకెళ్లి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. **- లత, పంచాయతీ కార్యదర్శి, దేవుపురం** – న్యూస్‌టుడే, నందిగాం

? కోటబొమ్మాళి బాలుర ఉన్నత పాఠశాల పక్కన మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకు పోవడంతో దుర్వాసనతో అవస్థలు పడుతున్నాం. **- విద్యార్థులు**

● క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

- బోయిన వెంకన్న, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి



రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదాన శిబిరానికి స్పందన

నరసన్నపేట, న్యూస్‌టుడే: కలాం నంద వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జోగిపేటలోని గ్రామంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. సొసైటీ మొదటి వార్షికోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ నేతృత్వంలో ఈ శిబిరం జరిగింది. 41 మంది యువకులు రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాగోటి రాంబాబు, ముఖలింగం, జగదీష్ పాల్గొన్నారు.



కంబకాయలో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



కొమ్ముసరియాపుట్టిలో సంపద తయారీ కేంద్ర నిర్మాణానికి భూమి పూజ

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నరసన్నపేట, సారవకోట, పాతపట్నం, నరసన్నపేట గ్రామీణం, మెళియాపుట్టి, కొత్తూరు, న్యూస్‌టుడే: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలుచోట్ల నిర్మాణ పనులకు భూమి పూజలు జరిగాయి. పల్లెల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యమని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.



నరసన్నపేట మండలం ఉర్లాంలో..



పెద్దపద్మాపురంలో పల్లెపండగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోవిందరావు

అత్యాచారయత్నం ఘటనలో నిందితుడికి రిమాండ్

నందిగాం, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన తుంగాన భువనేశ్వర్ అనే వ్యక్తి పక్క ఇంటిలో నివాసముంటున్న వివాహితపై శనివారం తెల్లవారు జామున అత్యాచారానికి యత్నించిన విషయం తెలిసిందే. భర్త లేని సమయంలో సదరు వ్యక్తి తనపై అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదుపై ఎస్‌ఐ షేక్ మహ్మద్ అలీ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి ఆదివారం భువనేశ్వర్‌ను అరెస్టు చేసి టెక్కలి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం

టెక్కలి పట్టణం వేగంగా విస్తరిస్తోంది. అయిదేళ్ల వైకాపా పాలనలో ఎక్కడికక్కడ ప్రణాళిక లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టినా ప్రశ్నించేవారు లేక పోవడంతో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఈ క్రమంలో గతంలో జరిగిన లోపాలను సరిదిద్దడం ప్రస్తుతం తలకు మించిన భారంగా మారింది. ప్రధానంగా కాలనీల్లో జరిగిన నిర్మాణాల్లో నిబంధనల అతిక్రమణ ఒక ఎత్తయితే ఖాళీ స్థలాలను దశాబ్దాలుగా విడిచిపెట్టి మురుగు కూపాలుగా మార్చడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో దోమలు, దుర్గంధంతో అవస్థలు పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శ్రీనివాసనగర్‌లోని ఖాళీ ప్రాంతంలో మురుగు నీరు

ఖాళీ స్థలాలు.. మురుగు కూపాలు..!

అప్రమత్తం కావాలి

ఖాళీ స్థలాలు సంబంధిత యజమానులవే కావచ్చు. వాటిపై సర్వహక్కులు వారికే ఉండొచ్చు. ఆ ప్రదేశాల్లో ఇప్పట్లో నిర్మాణాలు జరిపే ఉద్దేశం లేకున్నా వాటిని చదును చేసి నీరు నిల్వ ఉండకుండా ఎత్తు చేసుకోవాల్సిన బాధ్యత యజమానులపై ఉంది. ఇప్పటికే ఈ పరిస్థితులపై కసరత్తు ప్రారంభం కావడంతో కొత్త సమస్యలు తలెత్తకుండా యజమానులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. శ్రీనివాసనగర్, రోటరీనగర్, వెంకటేశ్వర కాలనీ వంటి ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. పట్టణ ప్రణాళికను సరిదిద్దేందుకు, భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా జరుగుతున్న కసరత్తుల్లో ప్రతి ఒక్కరూ సహకరిస్తేనే పూర్తిస్థాయి ఫలితాలు ఉంటాయని పాలకులు, అధికారులు చెబుతున్నారు.

చక్కదిద్దేందుకు చర్యలు

రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల శ్రీనివాసనగర్‌ను సందర్శించిన సమయంలో అక్కడి పరిస్థితులను చూసి తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఖాళీ స్థలాలను అలా విడిచిపెడితే ఊరుకునేది లేదని పేర్కొన్నారు. వాటిని ఎత్తు చేసే బాధ్యతను యజమానులు తీసుకోవాలని సూచించారు. మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో పంచాయతీ యంత్రాంగం రంగంలోకి దిగింది. ఎక్కడెక్కడ ఖాళీస్థలాలు ఉన్నాయి.. వాటి యజమానులు ఎవరు.. గుర్తించే పనిలో పడింది. ముందుగా వారికి సమాచారం ఇచ్చి స్థలాలను బాగు చేసుకోవాలని అధికారులు సూచించనున్నారు. నిర్ణీత గడువు తర్వాత నోటీసులిచ్చి తదుపరి చర్యలు తీసుకోనున్నారు.



మండాపాలెం కాలనీలో పరిస్థితి

సమాచారం ఇస్తాం

కాలనీల్లో నిర్మాణాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను గుర్తిస్తున్నాం. యజమానులకు వాటిని బాగు చేసుకోవాలని సమాచారం ఇస్తాం. ఖాళీ స్థలాలకు సైతం పన్ను వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. స్థలాలను వారు చదును చేయకుంటే పంచాయతీ ఆధ్వర్యంలో పని చేసి ఆ మొత్తాలను యజమానుల నుంచి వసూలు చేస్తాం.– **జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి, టెక్కలి**

పాతపట్నంలో కుండపోత వర్షం



కాపువీధిలో కురుస్తున్న వాన

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలంలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. దీంతో గత కొన్ని రోజులుగా ఎండతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. మేజరు పంచాయతీలోని పలు వీధుల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్న హరిశ్చంద్రపురం రహదారి అధ్వానంగా తయారైంది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. సమస్యను గత ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదు. ఈ మార్గంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, పోలాకి మండలాలకు చెందిన ప్రజలు ప్రయాణిస్తుంటారు. వారి అవస్థలు తీర్చేందుకు తెదేపా నేత ఉప్పాడ జయరాం ముందుకొచ్చారు. సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైదానం కాదండి.. మురుగే..!



హిరమండలం పంచాయతీ పెద్ద కోరాడ ప్రాథమిక పాఠశాల ముందు వర్షం నీరు, మురుగు నిలిచి విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ముందు సీసీ రహదారి పక్కన కొంత మంది వ్యక్తులు తమ సొంత స్థలంలో మట్టి వేసి ఎత్తు చేయడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. దోమలు, దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరిస్తామని ఎంఈవో కె. రాంబాబు, పంచాయతీ ఈవో హరికృష్ణ తెలిపారు.

– న్యూస్‌టుడే, హిరమండలం

నిర్లక్ష్యానికి నాలుగేళ్లు

టెక్కలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ యంత్రాలు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని పలువురు వాపోతున్నారు. వీటి కోసం అప్పట్లో రూ.35 లక్షలు వెచ్చించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యంత్రాలను బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణవాసులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు మాట్లాడుతూ.. సమస్యను రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం



మోక్షానికి ఎదురుచూపులు



తర్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో వంటగది, భోజన శాల, సరకుల నిల్వ కోసం ఐటీడీఏ నిధులతో భవన నిర్మాణ పనులు అయిదేళ్ల కిందట ప్రారంభించారు. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణలో శ్లాబ్ వరకు నిర్మాణం జరిగింది. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పనులు మధ్యలో నిలిపేశారు. దీంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. నిర్మాణం పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఐటీడీఏ అధికారులకు నివేదిస్తామని ఎంఈవో ఎం.వెంకటరమణ చెప్పారు.

– న్యూస్‌టుడే, సారవకోట

ప్రయాణించాలంటే ప్రయాసే

పాతపట్నం- మెళియాపుట్టి మండలాలను అనుసంధానం చేసే ఆల్ ఆంధ్ర రహదారి పరిస్థితి అధ్వానంగా తయారైంది. పాతపట్నం పంచాయతీ పరిధిలోని షిరిడిగిరి వద్ద మార్గం సగ భాగానికి పైగా కొట్టుకు పోయి రాళ్లు తేలడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ జేఈ గోపాలరావును వివరణ కోరగా రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పాతపట్నం



రూ.లక్షల వ్యయం.. నిరుపయోగం



డోల గ్రామంలో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని 2022లో ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు దీనిని తెరిచిన దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. నిర్మాణానికి ప్రభుత్వం అప్పట్లో రూ.21.8 లక్షలు వెచ్చించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా భవనంపై ఇంకా పేరు మార్చలేదు. గ్రామానికి కిలోమీటరు దూరంలో కేంద్రం ఉండటంతో ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై మండల వ్యవసాయశాఖాధికారి పి. చిరంజీవి మాట్లాడుతూ.. కేంద్రం తెరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పోలాకి

సంక్షిప్త సమాచారం

అదుపు తప్పిన వాహనం



పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం హరిద్వారం గ్రామం వద్ద మినీ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. టెక్కలి నుంచి గంగువాడకు వచ్చే మార్గంలో నీళ్ల సీసాలతో వస్తున్న వాహనం అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాలేదు.

పూడిక తొలగింపు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: కరకవలస పంచాయతీ పరిధిలోని కరకవలస, కవిటి గ్రామాల్లో కాలువల్లో పూడిక తొలగించినట్లు సర్పంచి యోగీశ్వరరావు తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. తాగునీటి బావులను శుభ్రం చేసినట్లు చెప్పారు.

ప్రతి సమస్యకు పరిష్కారం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ప్రజలు అనేక సమస్యలపై వినతులు సమర్పిస్తున్న నేపథ్యంలో ప్రతి దానికి పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. నిమ్మాడలో ఆయన కార్యాలయంలో ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టెక్కలిలో అన్న క్యాంటీన్ల నిర్వహణకు శ్రీకాకుళం మోక్షజ్ఞ, ఎన్టీఆర్ సేవాసంఘం ప్రతినిధులు రూ.20 వేలను మంత్రికి అందచేశారు.

వ్యవసాయ కూలీలకు ఎమ్మెల్యే పలకరింపు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పొలం బాట పట్టారు. మండలంలో పర్యటించిన ఆయన పద్ద గ్రామ సమీపంలో వ్యవసాయ క్షేత్రాల్లో పనిచేస్తున్న మహిళలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగునీరు అందించాలని వారు ఎమ్మెల్యేను కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: భగవద్గీత ప్రథమ దైవ గ్రంథమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి తలసముద్రం కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక మెట్టవీధి, గొల్ల వీధి, చిన్నబజారు ప్రాంతాల్లో ఆదివారం వారు ప్రచారం నిర్వహించారు. భగవద్గీత ప్రతి ఒక్కరికీ అవసరమని, అందులోని ధర్మాలను ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు రాము, జ్యోతి, రమేష్, రాజారావు, తిరుమల, సాయి, మౌనిక, గాయత్రి పాల్గొన్నారు.



కార్తిక స్నానాల కోసం ఏర్పాట్లు


మెళియాపుట్టి, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవం సందర్భంగా భక్తుల స్నానాల కోసం మెళియాపుట్టిలోని మహేంద్రతనయ నదీ పరివాహక ప్రాంతాన్ని తెదేపా నాయకులు యేరుసు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొక్లెయిన్‌తో శుభ్రం చేయించారు. నాయకులు మాడుగుల భానూజీరావు, దున్న శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సేవా మార్గాన్ని అనుసరించాలి



సారవకోట: తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

సారవకోట, నరసన్నపేట, హిరమండలం, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవా మార్గాన్ని అనుసరించాలని సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. సత్యసాయి బాబా అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా ఆదివారం టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యం, ధర్మం, ప్రేమ, సేవా మార్గాల్లో నడవాలని వక్తలు పేర్కొన్నారు. తిరువీధి, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు.



కోటబొమ్మాళి: సత్యసాయి భక్తుల నగర సంకీర్తన

సాయిబాబా ఆశయాలను కొనసాగిద్దాం

నరసన్నపేట, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగిద్దామని ప్రజా సంఘాల ప్రతినిధులు అన్నారు. స్థానిక కోమర్తి కూడలి వద్ద ఆదివారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ప్రతినిధి నేతింటి నీలంరాజు, దాలినాయుడు, రాజులు, వాసుదేవరావు, అప్పన్న, రమణమ్మ, సన్యాసమ్మ పాల్గొన్నారు.

దుర్గా ప్రసాద్‌కు అబ్దుల్ కలాం పురస్కారం



సదరన్ ప్రయివేటు టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక పద్మావతి విద్యా సంస్థల డైరెక్టర్ దుర్గాప్రసాద్ అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గుంటూరులోని ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఆదివారం ఈ పురస్కారాన్ని గుంటూరు ఎమ్మెల్యే అబ్దుల్ నజీర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆయనకు అందించారు. పద్మావతి విద్యా సంస్థల ఛైర్మన్ సూరిబాబు, కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

చోరీకి పాల్పడింది గ్రామస్థుడే..!

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: సంతలక్ష్మీపురం పంచాయతీ టక్కోయి గ్రామంలో విద్యుత్తు నిలిపివేసి కనకమ్మ అనే వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణం శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసిన విషయం తెలిసిందే. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన యువకుడే ఈ పనికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.





ఎర్రన్నా.. నిన్ను మరువలేమన్నా


దివంగత నేత ఎర్రన్నాయుడిని స్మరించుకుంటూ ఆదివారం ఆయన వర్ధంతి (తిథి ప్రకారం) కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు నిమ్మాడలో నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, సోదరులు ప్రభాకరరావు, హరివరప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యురాలు లలితకుమారి, అచ్చెన్న సతీమణి విజయమాధవి పూజలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి


ఆలయ వార్షికోత్సవం

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక పాతబస్టాండ్‌లోని మజ్జి గౌరమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ పునర్నిర్మాణం అనంతరం తొలి వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ప్రారంభించారు... తాళాలు వేశారు...!



శ్రీజగన్నాథపురంలో ఇదీ పరిస్థితి



ఎత్తురాళ్లపాడులో మూసి ఉన్న డిజిటల్ గ్రంథాలయం

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: గ్రామాల్లో డిజిటల్ గ్రంథాలయాలు, మహిళాసాధికారత స్వయం సహాయక సమాఖ్య భవనాల పేరుతో రూ.32 లక్షల వ్యయంతో ఎత్తురాళ్లపాడు, శ్రీజగన్నాథపురం పంచాయతీల్లో భవనాలు నిర్మించారు. వాటిని వైకాపా హయాంలో అప్పటి ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం వీటికి తాళాలు వేశారు. నేటి వరకు వీటిని వినియోగించిన దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. గుత్తేదారులకు బిల్లుల చెల్లింపులు జరిగాయని, అవసరమైన సామగ్రి రాలేదని పంచాయతీరాజ్ జేఈ స్పష్టంచేశారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ తెలిపారు.

ఘనంగా నందెన్నకు పూజలు



జలుమూరు మండలం లింగాలవలసలో..

జలుమూరు, నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నందెన్న ఉత్సవాల్లో భాగంగా జలుమూరు మండలం లింగాలవలసలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అబ్బాయిపేట, పెద్దదూగాం, చల్లవానిపేట తదితర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. నందెన్న ఉత్సవాల్లో భాగంగా ఉర్లాంలో యువకులు, చిన్నారులు విభిన్న వేషధారణలతో నృత్యాలు చేస్తూ అలరించారు.

తెరపై ఈనాడు

★ కీర్తన: వీక్షణం ★ కీర్తిక: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: ఇద్దరు ★ ఎస్‌వీసీ (రామలక్ష్మణ): వేట్టయన్ ★ సూర్యమహల్: విశ్వం ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: జనక అయితే గనక ★ మారుతి: లవ్ రెడ్డి

– న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

మిషన్ వాత్సల్యకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మిషన్ వాత్సల్య పథకానికి 2024-25 సంవత్సరానికి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమదాలవలస ఐసీడీఎస్ పీవో అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులను ఈ నెల 25లోగా ఐసీడీఎస్ ఆమదాలవలస కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు. నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు విద్య, వైద్యం వంటి కోసం నెలకు రూ.4 వేలు అందించే పథకమని తెలిపారు. మార్చి 25 నాటికి దరఖాస్తుదారులు 18 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆమదాలవలస ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

కూడలి విస్తరణ కలేనా..!

శ్రీకాకుళం నగరంలో నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే పాత బస్టాండ్ సమీపంలోని పొట్టి శ్రీరాములు కూడలి ప్రస్తుత ట్రాఫిక్‌కు అనుగుణంగా విస్తరించాల్సి ఉన్నా నగరపాలక సంస్థ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదు. దీంతో ఏళ్ల తరబడి వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావును వివరణ కోరగా నగరంలోని ప్రధాన కూడళ్ల విస్తరణలో భాగంగా ఈ కూడలిని విస్తరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి



రానున్న రోజుల్లో విస్తరణ చేపట్టి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.
–న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

నూతన విద్యావిధానంతో భవిష్యత్తు అంధకారం



ఎస్ఎఫ్ఐ బాలికల విభాగ నూతన కమిటీ

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఎస్ఎఫ్ఐ బాలికల విభాగ నూతన కన్వీనర్‌గా పవిత్ర, కో కన్వీనర్‌గా మోహిని, దివ్య, భవాని, శ్రావణిలు ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చందు, హరీష్‌లు తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కమిటీ ఎన్నికలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యావిధానాన్ని అమలు చేసి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

రహదారికి మోక్షం కలిగేనా..!

న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, పొందూరు

ఆమదాలవలస మండలం దూసి పంచాయతీ నెల్లిమెట్ట గ్రామానికి రహదారి నిర్మాణానికి 2019లో అప్పటి తెదేపా విప్, ప్రస్తుత ఎమ్మెల్యే కూన రవికుమార్ ఏపీ ఆర్ఆర్‌పీ పంచాయతీ ఇంజినీరింగ్ విభాగం నుంచి రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో నిర్మాణ పనులు ప్రారంభమైన తరువాత కొంత వరకు చేపట్టారు. ఎన్నికల అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

మట్టి దారితో అవస్థలు: రహదారి నిర్మాణం నిలిచిపోవడంతో గ్రామానికి ఎప్పటి నుంచో ఉన్న మట్టి దారే దిక్కైంది. వర్షాలు పడితే గోతుల్లో నీరు నిలిచి బురదమయం కావడంతో పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.



రెల్లిగడ్డపై ఉన్న శిథిల వంతెన

నెల్లిమెట్ట గ్రామానికి వెళ్లే రహదారిలో రెల్లిగెడ్డపై ఉన్న వంతెన శిథిలం కావడంతో ఏ క్షణంలో కూలుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రహదారి, వంతెన నిర్మాణాలను చేపట్టి పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



రాళ్లు తేలిన నెల్లిమెట్ట రహదారి

నిర్మాణానికి చర్యలు

నెల్లిమెట్ట రహదారి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నాం. గత తెదేపా ప్రభుత్వ హయాంలో కొంత వరకు నిర్మాణం జరిగాక ప్రభుత్వం మారడంతో నిలిచిపోయింది. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే రహదారి నిర్మాణం చేపడతాం.
– సత్యనారాయణ, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

తుపాను షెల్టర్ భవనాల పరిశీలన



పాత దిబ్బలపాలెంలోని తుపాను షెల్టర్ భవనాన్ని పరిశీలిస్తున్న సుధాకరరావు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: తీర ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాల సమయంలో వసతులు కల్పించే తుపాను షెల్టర్ భవనాల్లో ప్రజలు నివాసం ఉండేలా సౌకర్యాలు మెరుగుపరచాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.సుధాకరరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని బొంతలకోడూరు, పాత దిబ్బలపాలెం గ్రామాల్లోని తుపాను షెల్టర్ భవనాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను హెచ్చరికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

హిందీ మంచ్ కార్యవర్గ ఎన్నిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: హిందీ మంచ్ నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా బ్రహ్మాజీ, కనగుల సత్యంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఆదివారం జోనల్ కార్యదర్శి శ్రీధర్ పర్యవేక్షణలో నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షులుగా పార్వతీశం, ముఖ్య సలహాదారుగా విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, పలువురు ఇతర బాధ్యతలు స్వీకరించారు.

ఇది సచివాలయ భవనమే..!

సరుబుజ్జిలి మండలంలోని పెద్ద సవలాపురంలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం తాత్కాలిక భవనం ముందు భాగంలో ఎన్నికలకు ముందు పేర్లు రాసి ఉంచారు. ఎన్నికలు జరిగి సుమారు ఆరు నెలలు కావస్తున్నా సచివాలయం ముందు భాగంలో పేర్లు రాయకపోవడంలో పనులపై వచ్చేవారు ఎక్కడ ఉందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ఎం.పావని వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా తాను కొత్తగా వచ్చానని, ఇంతవరకు తన దృష్టికి రాలేదని, పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు.
– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..



పొందూరు పట్టణంలో నెహ్రూ పార్కు ఆవరణలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో జలజీవన్ మిషన్‌లో భాగంగా నిర్మాణం ప్రారంభించిన తాగునీటి ట్యాంకు అసంపూర్తిగా మిగిలిపోయింది. బిల్లులు సకాలంలో అందకపోవడంతో ప్రస్తుతం తాగునీటి ట్యాంకు అసంపూర్తిగా దర్శనమిస్తుంది. అధికారులు స్పందించి తాగునీటి ట్యాంకును పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో మనమ్మధరావుతో ప్రస్తావించగా తాగునీటి ట్యాంకు నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
–న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

మట్టి దారులతో అవస్థలు



ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలోని మెట్టక్కివలసలో చాలా వీధుల్లో నేటికీ మట్టి దారులే దర్శనమిస్తున్నాయి. గత ఐదేళ్లలో అప్పటి వైకాపా ప్రభుత్వం చాలా వార్డుల్లో సీసీ రహదారులు, కాలువలు నిర్మించలేదు. దీంతో వర్షాలు పడినప్పుడు మట్టి దారులపైకి వర్షం, మురుగునీరు చేరడంతో బురదమయంగా మారుతున్నాయి. దీంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా సీసీ రహదారుల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ పి.బాలాజీప్రసాద్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా అన్ని వార్డుల్లో సమస్యలు గుర్తించామని, త్వరలోనే కాలువలతో కూడిన సీసీ రహదారుల నిర్మాణం చేపడతామన్నారు.
– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఆక్రమించేయ్.. ఆపేదెవరు..

శ్రీకాకుళం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో కొందరు స్థానికులు రహదారుల పక్కన ఖాళీ స్థలాలను ఆక్రమించి తమ కారు షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టడంతో రహదారులు ఇరుకుగా మారాయి. రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు ఎక్కువవుతున్నాయి. గతంలో ఈ ప్రాంతంలో సీసీ కాలువలు మంజూరైనా పలు కారణాలతో పనులు జరగలేదు. నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా ఆక్రమణలను గుర్తించి నోటీసులు జారీ చేస్తామని వెల్లడించారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



విద్యుద్దీపాల ఏర్పాటు



స్పందనకు వందనం

ఆమదాలవలస మున్సిపాలిటీలోని 21వ వార్డు కుద్దిరాం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుద్దీపాలను మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేశారు. దీపాలు గత కొన్ని రోజులుగా వెలగక పోవడంతో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నాసిబ్బంది పట్టించుకోకపోవడంతో ఈ సమస్యపై ఈ నెల 17న 'ఈనాడు'లో "అంధకారంలో కుద్దిరాం మార్గం..!" శీర్షికతో సమస్య చిత్రాన్ని ప్రచురించడంతో మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.
–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

అవీ..ఇవీ..అన్నీ

ఆకట్టుకున్న వేషధారణ



గార, న్యూస్‌టుడే: గార మండలం పూసర్లపాడు గ్రామంలో ఆదివారం గౌరీ పౌర్ణమి ఉత్సవాల సందర్భంగా శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

ఉపనిషన్మందిరంలో భాగవత ప్రవచనం

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: నగరంలో పాలకొండరోడ్డులో కోదండరామాలయం ప్రాంగణంలో ఉపనిషన్మందిరంలో ఆదివారం మేడూరి వెంకట నరసింగరావు భాగవత ప్రవచనం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేవతల్లో మహావిష్ణువు, క్షేత్రాల్లో కాశీక్షేత్రం, పురాణాల్లో భాగవతం శ్రేష్ఠమైనవని తెలిపారు.

చిన్నారులకు పోటీలు


శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: నగరంలో కలెక్టర్ బంగ్లా సమీపంలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హితేష్, భవిష్య, సాత్విక, కోమల్‌లు బహుమతులు పొందారని చిల్డ్రన్స్ లాఫింగ్‌క్లబ్ నిర్వాహకుడు లోకనాథం నందికేశ్వరరావు తెలిపారు.

దేవాంగ సంక్షేమ సంఘ సభ్యులు వీరే..

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని దేవాంగ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆ సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శిగా సూర్యప్రసాదరావు, కోశాధికారిగా గణపతిరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టైపిస్టు, స్టెనోగ్రాఫర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శిగా అరుణ్‌కుమార్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టైపిస్టు, స్టెనోగ్రాఫర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి కళ్లేపల్లి అరుణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గుంటూరులోని నిర్వహించిన సంఘ ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నికల అధికారులు నాగభూషణం, శివరామకృష్ణలు ప్రకటించారు. అనంతరం అరుణ్‌కుమార్‌ను రాష్ట్ర సంఘ నాయకులు సన్మానించారు.





అన్న క్యాంటీన్‌కు విరాళం

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్‌కు నందమూరి మోక్షజ్ఞ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు మాదారపు డేవిడ్ రూ.20వేలు విరాళం అందించారు. ఆదివారం మంత్రి అచ్చెన్నాయుడికి ఈ మొత్తాన్ని అందజేశారు.

బొడ్డేపల్లి సేవలు మరువలేనివి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీపీ బొడ్డేపల్లి మురళీధర్ సేవలు మరువలేనివని మాజీ ఎంపీపీ బొడ్డేపల్లి గోవిందగోపాల్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొడ్డేపల్లి మాధురి అన్నారు. బొడ్డేపల్లి మురళీధర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని అక్కులపేట జంక్షన్ వద్ద ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్పంచి బొడ్డేపల్లి గౌరీపతి, ఎంపీటీసీ ప్రతినిధి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, గోపి, సింహాచలం, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భక్తి భావాన్ని అలవరుచుకోవాలి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: సమాజంలో అందరూ భక్తి భావాన్ని అలవరుచుకోవడంతో పాటు శ్రీరాముని అడుగు జాడల్లో నడిచినప్పుడే మంచి గుర్తింపు ఉంటుందని శ్రీరామ భక్తులు బొంగు జోగులాచార్యులు అన్నారు. మండలంలోని రొట్టవలస శ్రీరామానంద ఆశ్రమంలో ఆశ్రమం నిర్వాహకుడు తొత్తడి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం సత్సంగ కార్యక్రమం నిర్వహించారు.

జానపద కళాకారుడి ప్రతిభ

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: తాడేపల్లిగుడెంలోని శ్రీశ్రీ కళావేదిక ఈ నెల 19న ప్రపంచ తెలుగు సాహితీ సభను నిర్వహించింది. గజల్స్, జానపద గీతాలు, డప్పు, ఫ్లూటు, మౌత్ ఆర్గన్ తదితర అంశాల్లో అదే వేదికపై నిరంతరాయంగా 24 గంటల పాటు తమ కళను ప్రదర్శించినట్లు ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ప్రముఖ జానపద కళాకారుడు డా. కె.ఎ.రాములు తెలిపారు. ఈ సభకు 550 మంది కళాకారులు, కవులు హాజరై పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో చక్కని ప్రతిభ కనబరిచినందుకు ప్రపంచ తెలుగు సాహితీ సభ జాతీయ అధ్యక్షుడు డా. టి.పార్థసారథి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు, బంధువులు, తదితరులు ఆయనను అభినందించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

శ్రీకాకుళం గ్రామీణం, గార, జి.సిగడాం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం మండలంలోని రాగోలు, గూడెం, వాకలవలస, లంకాం, ఒప్పంగి, సానివాడ పంచాయతీల్లో అధికారులు నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో ఆయన పాల్గొని అభివృద్ధి పనులు ప్రారంభించారు. ● గార మండలంలోని అంపోలు, కొత్తూరు-సైరిగాం, సతివాడ, నిజామాబాద్, కొర్ని, కొర్లాం, కొమరవానిపేట పంచాయతీ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజలు చేసి పనులు ప్రారంభించారు. ● కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెదేపా మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ అన్నారు. జి.సిగడాం మండలంలోని జగన్నాథవలస గ్రామంలో



లంకాంలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వీర నారీమణుల ఉన్నతికి కృషి



సర్వసభ్య సమావేశానికి హాజరైన మాజీ సైనికులు, వీరనారీమణులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: వీరనారీమణుల ఉన్నతికి కృషి చేస్తామని మాజీ సైనికుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు కటకం పూర్ణచంద్రరావు అన్నారు. నగరంలోని మాజీ సైనికుల సామాజిక భవనంలో ఆదివారం నెలవారీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పౌరవిమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు వీరనారీమణులకు భరోసానిచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. విద్యార్హత కలిగిన వీరనారీమణులు తమ వివరాలను డీఈఎఫ్‌లో అందజేయాలని సూచించారు. వితంతువులైన వీరనారీమణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. సమాఖ్య ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, వెటరన్ గ్రూప్ ఛైర్మన్ కెప్టెన్ ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు సంజీవిరావు, కృష్ణారావు, లక్ష్మణరావు, లక్ష్మీకాంతమ్మ, అమ్మన్నమ్మ, జమున, సౌభాగ్య, లీలాకుమారి, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా గోతులే



ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం తోటపాలెం నుంచి ముద్దాడ, కొంగరాం, ఒలేటి అగ్రహారం తదితర గ్రామాలకు వెళ్లే రహదారి అడుగడుగునా గోతులమయంగా తయారయ్యింది. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీరాజ్ ఏఈ సూర్యచంద్ర దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేస్తామని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

పొందూరు, న్యూస్‌టుడే: సనాతన ధర్మంపై ప్రతి ఒక్కరూ ప్రచారం చేయాలని కృష్ణాపురం ఆనందాశ్రమ పీఠాధిపతి, ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్తు అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. మండలంలోని కృష్ణాపురం ఆనందాశ్రమంలో ఆదివారం నిర్వహించిన సత్సంగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటితరం యువతలో ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. ఆధ్యాత్మిక చింతన ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రషర్ వాహనాల నుంచి సీనరేజీ వసూళ్లా..!



సీనరేజీ వసూలు చేస్తున్న సిబ్బంది వీరే

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలంలో క్వారీ, క్రషర్ వాహనాల నుంచి సీనరేజీ వసూళ్లపై ఆరోపణలు వస్తున్నాయి. నాలుగు రోజులుగా ఏఎంఆర్ పేరు మీద క్వారీ నుంచి రాయి తీసుకువెళ్తున్న వాహనాలు, క్రషర్ నుంచి చిప్స్ తరలిస్తున్న వాహనాల నుంచి వసూళ్లు చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. యూనిట్ రాయి చిప్స్‌కు రూ.720, క్రషర్ డస్ట్‌కు రూ.500, ఎర్రమట్టికి రూ.320 వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం నుంచి కాంట్రాక్టు విశ్వసముద్ర పేరు మీద ఉండగా వసూళ్లు మాత్రం ఏఎంఆర్ పేరు మీద వసూళ్లు చేస్తున్నారని చెబుతున్నారు. విశ్వసముద్ర సంస్థకు అనుమతులు ఆగస్టు వరకు మాత్రమే ఉన్నాయి. స్పష్టమైన అనుమతి పత్రాలు లేకుండా చెక్‌పోస్టు పెట్టి చేస్తున్న వసూళ్లపై వాహన డ్రైవర్లు, క్రషర్ యాజమానులు వాగ్వివాదానికి దిగుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై మైనింగ్ అధికారులను ప్రశ్నించగా జిల్లాలో సీనరేజీ కాంట్రాక్టు ఏఎంఆర్ సంస్థకు ఇచ్చారని, ఇంకా అనుమతి పత్రాలు రాలేదని, త్వరలోనే వస్తాయని, అందుకే విశ్వసముద్ర పేరు మీద వసూళ్లు చేస్తున్నారన్నారు.

ఘనంగా సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవం



వేణమ్మపేటలో సత్యసాయిబాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఆమదాలవలస గ్రామీణం, శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆమదాలవలస జోనల్ పరిధిలో సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు సేవా సమితి జోనల్ కోఆర్డినేటర్ ఎం.జనార్ధనరావు అన్నారు. ఆదివారం ఆమదాలవలస జోనల్ పరిధిలో అక్కులపేట, వేణమ్మపేట, శ్రీనివాసాచార్యులపేట, బొబ్బిలిపేట, నెల్లిపర్తి, చీమలవలస ప్రాంతాలతో పాటు ఆమదాలవలస పట్టణంలో, బూర్జ మండలంలోని గ్రామాల్లో అతరణ దినోత్సవాన్ని సత్యసాయి భక్తులు నిర్వహించారన్నారు. బూర్జ నుంచి ఆమదాలవలస మండలం మీదుగా పట్టణం వరకూ ప్రదర్శన నిర్వహించినట్లు చెప్పారు. సత్యసాయి సేవా సమితుల కన్వీనర్లు, భక్తులు పాల్గొన్నారు. ●జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో సత్యసాయి మందిరాలు, సత్యసాయి భజనమండళ్లలో ఆసత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నగర సంకీర్తన, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగాయి.



కిడ్నీ ఆసుపత్రితో మెరుగైన వైద్య సేవలు

జిల్లాలో మొట్టమొదటిగా కార్పొరేట్ స్థాయిలో కిడ్నీ ఆసుపత్రి అందుబాటులోకి రావడం వల్ల మెరుగైన వైద్య సేవలందుతాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రి రోడ్డులో కొత్తగా నిర్మించిన హరిప్రసాద్ కిడ్నీ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అధునాతన వైద్య పరికరాలు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ దుంపల హరిప్రసాద్ చెప్పారు.
–న్యూస్‌టుడే, గుజరాతీపేట(శ్రీకాకుళం)

వేర్వేరు చోట్ల అన్నదానం

శ్రీకాకుళం సాంస్కృతికం పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: దుర్గామాత శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా నగరంలో మొండేటివీధిలో శిర్డీ సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయి మందిరం సమీపంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్లు సంఘ ప్రతినిధి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ● పొందూరు పాత బస్టాండ్ వద్ద వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.